అయ్యన్నపాత్రుడిదే నర్సీపట్నం


ధ్రువీకరణపత్రం తీసుకుంటున్న అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: టీడీపీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు విజయం సాధించారు. నర్సీపట్నం అసెంబ్లీ బరిలో ఎనిమిది మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధాన పార్టీలకు చెందిన ఉమాశంకర్ గణేష్, అయ్యన్నపాత్రుడు మధ్య పోటీ నెలకొంది. మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో భారీ మెజారిటీతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌పై టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు గెలుపొందారు. పది సార్లు ఎమ్మెల్యేగా అయ్యన్నపాత్రుడు పోటీ చేసినప్పటికీ, రెండు సార్లు మాత్రమే 20 వేలకు పైచిలుకు ఓట్లతో మెజారిటీ సాధించారు. ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత కనబరిచారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లల్లో సైతం మెజారిటీ కనబరిచారు. మొత్తం 19 రౌండ్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ అయ్యన్నపాత్రుడు తన ఆధిక్యతను చాటుతూ వచ్చారు. ఉదయం 8 గంటలకు అధికారులు ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొదటిగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం ఈవీఎంల్లోని ఓట్లను ఒక్కొక్కటిగా లెక్కింపు చేపట్టారు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు అయ్యన్నపాత్రుడు ఆధిక్యతను కనబరుస్తూ చివరికి భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 1,79,849 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లలో ఉమాశంకర్ గణేష్‌కు 71,451 ఓట్లు, అయ్యన్నపాత్రుడుకు 94,588 ఓట్లు పోలయ్యాయి. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బొట్టా నాగరాజు- 1244, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రుత్తల శ్రీరామ్మూర్తి 1088, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి జోగా చంద్రమౌళి- 300, జైభీమ్ రావు భారత్ పార్టీ అభ్యర్థి నేతల నాగేశ్వరరావు 440, స్వతంత్ర అభ్యర్థులు పైల సూర్య గణేష్ 270, బయపురెడ్డి భద్రాచలం -678 చొప్పున ఓట్లు వచ్చాయి.

2014- 2019 ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు పోలైన ఓట్లు

2014 సార్వత్రిక ఎన్నికలు..
మొత్తం ఓట్లు: 1,98,645
పోలైన మొత్తం ఓట్లు: 1,63,304
చెల్లని ఓట్లు: 817
పోలింగ్ శాతం: 82.17
వైఎస్సార్ సీపీ అభ్యర్థి గణేష్‌కు పోలైన ఓట్లు: 77,388
టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడుకు పోలైన ఓట్లు: 79,726
అయ్యన్నపాత్రుడుకు వచ్చిన మెజార్టీ: 2,338
2019 సార్వత్రిక ఎన్నికలు..
మొత్తం ఓట్లు: 2,10,578
పోలైన మొత్తం ఓట్లు: 1,75,566
చెల్లని ఓట్లు: 7001
పోలింగ్ శాతం: 82.33
వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గణేష్‌కు పోలైన ఓట్లు: 93,818
టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడుకు పోలైన ఓట్లు: 70,452
ఉమాశంకర్ గణేష్‌కు వచ్చిన మెజార్టీ: 23,366

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు

రౌండ్	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	మెజార్టీ
1వ రౌండ్	3220	5270	2050
2వ రౌండ్	4073	4651	578
3వ రౌండ్	4296	4618	322
4వ రౌండ్	4119	5024	905
5వ రౌండ్	4573	4761	188
6వ రౌండ్	3725	4871	1146
7వ రౌండ్	4484	5294	810
8వ రౌండ్	4173	5111	938
9వ రౌండ్	4196	5099	903
10వ రౌండ్	3876	5546	1670
11వ రౌండ్	3571	5019	1448
12వ రౌండ్	3440	6619	3179
13వ రౌండ్	3640	6473	2833
14వ రౌండ్	3741	5400	1659
15వ రౌండ్	4130	5226	1096
16వ రౌండ్	3504	4721	1217
17వ రౌండ్	4363	5083	720
18వ రౌండ్	4327	5802	1475
19వ రౌండ్	3411	2623	788

మాడుగులలో బండారు గెలుపు


పోస్టల్ బ్యాలెట్ లెక్కిస్తున్న దృశ్యం

మాడుగుల: మాడుగుల అసెంబ్లీ స్థానాన్ని టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి 28,026 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అనకాపల్లిలో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఓట్ల లెక్కింపు సాయంత్రం 7 గంటల వరకు సాగింది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించారు. తర్వాత 14 టేబుళ్లపై 17 రౌండ్లలో ఈవీఎంల ఓట్లు లెక్కించారు. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో మొత్తం 1,88,989 ఓట్లకుగాను 1,66,562 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 86.03 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తికి 91,869 ఓట్లు లభించగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఈర్లె అనురాధకు 63,843 ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డు శ్రీనువాసరావు- 1,784, బహుజన సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి కరణం తిరుపతిరావుకు -1,675, నవభారత నిర్మాణ సేవా పార్టీ అభ్యర్థి తాళ్ల రవికి -532, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అభ్యర్థి లెక్కల ఈశ్వరరావు- 382, స్వతంత్ర అభ్యర్థి బూడి రవికుమార్‌కు 395, స్వతంత్ర అభ్యర్థి మతల ఆరినాయుడుకు 244, స్వతంత్ర అభ్యర్థి మల్లారపు లోవచంద్‌కు -427, నోటాకు 4,070 ఓట్లు వచ్చాయి.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు

రౌండ్‌లు	టీడీపీ	వైఎస్సార్	మెజారిటీ
1.	6255	3739	2496
2.	4779	3246	1533
3.	5135	3262	1873
4.	5262	4119	1143
5	5333	3640	1693
6.	5267	4386	881
7.	4925	3483	1442
8	5265	3666	1599
9.	5693	3800	1893
10	5583	3051	2532
11	5530	4891	631
12	5292	4108	1184
13.	4679	4415	264
14.	5246	3544	1702
15.	5246	3145	2101
16	6405	3659	2746
17.	4197	2844	1353

మాడుగుల నియోజకవర్గం

2014 ఎన్నికలు :
మొత్తం ఓట్లు 1,47,160
పోలైన ఓట్లు 1,39,887
పోలైన ఓట్లు శాతం వివరాలు : 84.46
బూడి ముత్యాలనాయుడు (వైఎస్సార్‌సీపీ అభ్యర్థి)కు వచ్చిన ఓట్లు 72,299 (49.13) శాతం
గవిరెడ్డి రామానాయుడు (టీడీపీ అభ్యర్థికి) వచ్చిన ఓట్లు 67,538 (45.89 శాతం)
మెజార్టీ 4,761 ఓట్లు.
విజేత - వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు
2019 ఎన్నికలు..
మొత్తం ఓట్ల వివరాలు : 1,85,791
పోలైన ఓట్ల వివరాలు : 1,55,306
పోలైన ఓట్లు శాతం : 83.59 శాతం
బూడి ముత్యాలనాయుడు (వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లు 78,065 (50.99 శాతం)
గవిరెడ్డి రామానాయుడు (టీడీపీ అభ్యర్థి)కి వచ్చిన ఓట్లు 62,256 (40.38 శాతం)
విజేత : వైఎస్సార్ సీపీ అభ్యర్థి బూడి ముత్యాలునాయుడు

చోడవరంలో టీడీపీ విజయకేతనం


కౌంటింగ్ కేంద్రంలో అధికారులు


పార్టీ కార్యకర్తలతో టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి రాజు

చోడవరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో చోడవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.ఎస్.ఎన్.ఎస్ రాజు తమ సమీప ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీపై 41,165 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 243 పోలింగ్ కేంద్రాలను 18 రౌండ్లుగా విభజించి ఓట్లు లెక్కించారు. మొత్తం 1,84026 ఓట్లు పోలవ్వడంతో టీడీపీ అభ్యర్థి రాజుకు 1,07,871, వైఎస్సార్ సీపీ అభ్యర్థి ధర్మశ్రీకి 66,706 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి జగతా శ్రీనివాసరావుకు 2,453, బీఎస్పీ అభ్యర్థి వేగి మహాలక్ష్మినాయుడుకు 1,131, సీపీఐఎంఎల్ అభ్యర్థి సవరాల గణేష్‌కు 658, ఇండిపెండెంట్ అభ్యర్థి పేడిచెర్ల విజయరామరాజుకు 388, నోటాకు 3,736 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థి రాజు విజయకేతనం ఎగురవేయడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించినందుకు నియోజకవర్గం అభివృద్ధికి పూర్తిగా కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజు అన్నారు.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోలైన ఓట్లు

రౌండు	టీడీపీ	వైఎస్సార్‌సీపీ	మెజార్టీ
1.	5816	4303	1513
2.	6326	3946	2380
3.	6435	3814	2621
4.	5388	4083	1305
5.	6292	4475	1817
6.	6556	4520	2036
7.	6509	3720	2789
8.	5205	4024	1181
9.	6188	3826	2362
10.	5480	4170	1310
11.	6085	3723	2362
12.	5515	3107	2408
13.	6585	4369	2216
14.	6960	3498	3462
15.	5956	1862	4094
16.	7159	3218	3941
17.	7042	4804	2234
18.	2093	1242	851

సన్యాసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు


దేవరాపల్లిలో సన్యాసమ్మ తల్లిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు, భక్తులు

దేవరాపల్లి: గ్రామదేవత సన్యాసమ్మ తల్లికి మంగళవారం దేవరాపల్లి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయం వద్ద ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 4న అమ్మవారి ఒడ్డు పండగ జరగాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలుతోపాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పోలీసుల సూచన మేరకు ఈ నెల 18కు వాయిదా వేశారు.

అయినప్పటికీ యధావిధిగా మంగళవారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, వేచలపు అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ సామిరెడ్డి సత్యవతి, తదితర గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

బోసిపోయిన రహదారులు


జనసంచారం లేక బోసిపోయిన నర్సీపట్నం-వడ్డాది ఆర్‌అండ్‌బీ రోడ్డు

టీవీలకు అతుక్కుపోయిన జనాలు

రోలుగుంట: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు వేళ మంగళవారం ఉదయం నుంచి రోడ్లన్నీ బోసిపోయాయి. పోలింగ్ ప్రక్రియ జరిగి లెక్కింపు ఫలితాల కోసం మూడు వారాలుగా ఆయా పార్టీల నాయకులు, ప్రజలు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జనాలు, వ్యాపారులు, ఆటోవాలాలు సైతం ఫలితాలు వీక్షించేందుకు టీవీలకు అతుక్కుపోయారు. దీంతో రహదారులు బోసిపోయాయి. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆయా పార్టీల ఆధిక్యత, విజయం వీచిక కొలిక్కి రావడంతో కార్యకర్తలు, అభిమానులు రోడ్ల పైకి వచ్చారు. ఎస్సై ఎల్.సురేష్ తన సిబ్బంది, ప్రత్యేక సిబ్బందితో అల్లర్లు అరికట్టే చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నిఘా గ్రామాల్లోను, రోలుగుంట జన సమూహ కేంద్రాల్లోనూ ఎస్సై తన వాహనంలో అరగంట కొకసారి పర్యవేక్షించారు.

చురుగ్గా భవన నిర్మాణం


భవనం పనులు జరుగుతున్న దృశ్యం

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ నూతన భవనం పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ భవన నిర్మాణం కోసం రూ.2 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ఇక్కడ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికి అదనపు నూతన భవనం కోసం నిధులు మంజూరు కావడంతో పనులు చకచక జరుగుతున్నాయి. ఈ భవనం పనులు పూర్తయితే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు తొలగినట్టే.

క్లుప్తంగా


రెండు గ్రామాల్లో వైద్య సేవలు

మాడుగుల రూరల్: మండలంలో రెండు గ్రామాల్లో మంగళవారం ఫ్యామిటీ డాక్టరు కార్యక్రమం నిర్వహించారు. జాలంపల్లి శివారు రావిపాలెంలో 80 మందికి కింతలి పీహెచ్‌సీ డాక్టర్ కె.ఎం.నాయుడు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, వ్యాధిగ్రస్తులను పరీక్షించారు. మందులు పంపిణీ చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ మాడుగుల-3 ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 70 మందికి వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు వైద్య సేవలందించారు.

నేడు మాస శివరాత్రి పూజలు

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున బుధవారం ఉదయం 10 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితా శివ సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకులు సాలగ్రామ రఘు తెలిపారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 8 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	5,100	5,100
రెండో రకం	4,060	4,350
మూడోరకం	3,410	4,000

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706)ను సంప్రదించవచ్చు.

సిద్ధమవుతున్న వరినారు మడులు


వీరనారాయణంలో సిద్ధం చేస్తున్న నారుమడి

మాడుగుల రూరల్: ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో సాధారణ వరి విస్తీర్ణం 10,560 ఎకరాలు కాగా, గతేడాది 11 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఈ ఏడాది ఇప్పటికే నారుమడులను దున్ని సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా మరో రెండు రోజుల వ్యవధిలో వరి విత్తనాలు విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. రైతులు ప్రస్తుతం వరి నారుమడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

మండుతున్న ఎండలు


నిర్మానుష్యంగా కశింకోట పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజానీకం సూర్య తాపంతో మంగళవారం సతమతమయ్యారు. కొద్ది రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం మంగళవారం మళ్లీ వేడెక్కింది. ఒక్కసారిగా వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక వైపు ఉష్ణోగ్రత, మరో వైపు ఎన్నికల ఓట్ల లెక్కింపుతో ప్రజలు టీవీల ముందు అతుక్కుపోయి ఇళ్లకే పరిమితం కావడంతో కశింకోటలోని పంచాయతీ ప్రధాన రహదారితోపాటు, వీధులన్నీ జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఉష్ణ తాపం తగ్గడంతో ప్రజలు తమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు.

పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నేడు

అనకాపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై మూడు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం


మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య

చింతపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తో సహా అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయోత్సవం నమోదు చేసుకుందని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఫలితం ఊహించిందేనని, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమంతోనే ఈ ఫలితాలు సాధ్యమైనట్లు చెప్పారు. మన్యంలో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు .విజయం సాధించిన అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగంనకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

మామిడి లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా


గోస్తనీ నది వంతెనపై మామిడి లోడుతో బోల్తా పడిన వ్యాన్


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ విఘ్నేష్‌ను వెలుపలకు తీస్తున్న సిబ్బంది

తగరపువలస : స్థానిక గోస్తనీ నదిపై గల జాతీయ రహదారి వంతెనపై మంగళవారం మధ్యాహ్నం మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ వంతెన పైకి చేరుకుంటున్న సమయంలో సేలం ప్రాంతానికి చెందిన డ్రైవర్ విఘ్నేష్ నిద్ర మత్తు కారణంగా డివైడర్‌పైకి చేరి వంతెన గోడను ఢీకొట్టాడు. దీంతో ఐషర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో అందులోని మామిడికాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదం జరిగే ముందు ఆవును తీసుకెళ్తున్న మరో వ్యాన్‌ను ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఐషర్ వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ విఘ్నేష్ కాలు ఇరుక్కుపోయింది. దీంతో భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది, తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని శ్రమించి విఘ్నేష్‌ను బయటకు తీశారు. ముందు వ్యాన్‌లో ఉన్న ఆనందపురం మండలం వేమగొట్టిపాలేనికి చెందిన ఆదినారాయణ, మరో వ్యక్తికి గాయాలు కావడంతో ముగ్గురిని సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎట్టకేలకు ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి


పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసిన శ్రీరాములను తెలుగు జాతి మర్చిపోదన్నారు. ఆయన జ్ఞాపకార్థం నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు పెట్టి 16 ఏళ్లయిందన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకులు పిరట్ల నరసింహమూర్తి, ప్రతినిధులు గుంగుపాం నాగేశ్వరరావు, లక్ష్మి, స్వాతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్యోన్య దాంపత్యం

భార్యను చంటిబిడ్డలా ఎత్తుకొని తీసుకెళ్తున్న భర్త


భార్య లక్ష్మిని ఎత్తుకొని తీసుకెళ్తున్న భర్త వెంకటస్వామి, వెంట బాబు చెర్రీ

రాజవొమ్మంగి: ఉదయాన్నే పొలానికి వెళ్లడం, పనులు లేని సమయాల్లో కూలీ పనులకు వెళ్లడం మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన వీకా వెంకటస్వామి అనే గిరిజనుని దిన చర్యలో ఓ భాగం. అతని జీవనంలో మరో తీయని బంధం, తన సహచరి భార్య లక్ష్మి. తాను ఎక్కడికి వెళ్లినా లక్ష్మిని చంటిపిల్లలా ఎత్తుకొని తీసుకెళ్లడం వీరి అన్యోన్న దాంపత్యానికి నిదర్శనం.. వెంకటస్వామి అనురాగానికి నిదర్శనం. లక్ష్మికి పోలియో కారణంగా చిన్నప్పుడే కాళ్లు చచ్చుబడిపోవడంతో నడవలేని పరిస్థితి. అయినా వెంకటస్వామి ఇష్టపడి లక్ష్మినే వివాహం చేసుకొన్నాడు. వెంకటస్వామి తన భార్య లక్ష్మిని కొంచెం దూరం చేతులపై, మరికొంత దూరం తన మోటారుసైకిల్‌పై తీసుకొని వెళ్తాడు. వీరికి రెండేళ్ల బాబు (చెర్రీ) ఉన్నాడు. లక్ష్మీ ఇంటి పనులు తానే స్వయంగా చేసుకొంటుంది. భార్యను ఎత్తుకొని తిరగడం కష్టమైనప్పటికీ వెంకటస్వామి ఎప్పుడూ భారంగా భావించలేదని చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న చిన్నారుల కోలాటం

రాజవొమ్మంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న చిన్నారులు గ్రూపుగా ఏర్పడి ఖాళీ సమయాల్లో కోలాట ప్రదర్శనలు ఇస్తున్నారు. శ్రీ నూకాంబికా కోలాట బృందం పేరుతో ఆలయాల వద్ద పండుగలు, ఉత్సవాలు తదితర వేడుకల్లో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. ఈ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి.

వీరి ప్రతిభను స్థానికులు అభినందిస్తున్నారు. టీవీల్లో వచ్చే కార్యక్రమాలు చూసి సొంతంగా ఈ కళ నేర్చుకున్నట్టు చిన్నారులు చెబుతున్నారు. తమకు మరింత ప్రోత్సాహం అందిస్తే మరింత కోలాటం తదితర భారతీయ సంప్రదాయ నృత్యాల్లో శిక్షణ పొంది ఉత్తమ ప్రదర్శన ఇస్తామంటున్నారు. ఈ చిన్నారులకు కుమారి, లక్ష్మి అనే స్థానిక మహిళలు కోలాటంలో శిక్షణ ఇస్తున్నారు.